క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో రైల్వే ఏజీఎం


స్వామిని దర్శించుకుంటున్న ఏజీఎం ధనుంజయులు

గుంతకల్లు రూరల్: దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు దంపతులు మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే ఆలయానికి చేరుకున్న ఏజీఎం దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలతో పాటు స్వామి ఫోటోను బహూకరించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ పనుల తనిఖీ

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను మంగళవారం కమిషనర్ శ్రీనివాసులు , మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. పనులను నెలాఖరుకు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిల్లు కలెక్టర్ చంద్ర, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'గడప గడపకూ' సమస్యలు పరిష్కరించండి


సచివాలయ కార్యదర్శులను ఆరా తీస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అందిన వినతులకు నిర్ణీత వ్యవధిలోగా పరిష్కార మార్గం చూపాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. మంగళవారం 18వ వార్డు సచివాలయాన్ని కమీషనర్ తనిఖీ చేశారు. సచివాలయ కార్యదర్శుల పరిధిలో ఉన్న సమస్యలేవైనా పరిష్కరించారా అని ఆయన ఆరాతీశారు. స్పందన అర్జీలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మున్సిపల్ ఆర్ఓ నాసిర్‌హుసేన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలు జిల్లా తుగ్గలికి చెందిన శ్రీనివాసులు పని మీద బైక్‌పై గుతికి వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. అయితే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెళుతున్న సమయంలో వెనుక నుంచి మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెండో విడత 110 కొత్త పింఛన్ల మంజూరు


పి.కొండాపురంలో కొత్త పింఛన్లు అందిస్తున్న దృశ్యం

పామిడి: మండలానికి రెండో విడత 110 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బీపీ శశికళ మంగళవారం తెలిపారు. అందులో భాగంగా పామిడి టౌన్‌కు 50, రూరల్‌కు 60 చొప్పున కొత్త పింఛన్లు వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా పాగరూరులో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, పీ కొండాపురంలో 1వవార్డు ఇన్‌చార్జ్ మునగల రంగనాయకులు, పామిడిలో బీసీ మండల నేత జోజోడే కుమార్ లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు.

కూచిపూడి నాట్యంలో చిన్నారుల ప్రతిభ


నాట్యంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు

తాడిపత్రి అర్బన్: వారణాశిలోని కాశీ విశ్వనాథుని సన్నిధిలో నిర్వహించిన కూచిపూడి న్యాట ప్రదర్శనలో తాడిపత్రికి చెందిన చిన్నారులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 9న వారణాశిలో కూచిపూడి నాట్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో తాడిపత్రి వందన డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచి పురస్కారాలను కై వసం చేసుకున్నట్లు నిర్వాహకుడు ప్రవీణ్ తెలిపారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని 26వ వార్డులోని బుక్కపట్నం వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు నాలుగేళ్లలో అందిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంతో పాటు తాడిపత్రిలో జరుగుతున్న అభివృద్ధిని వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌కే పట్టం కట్టాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ తమకు స్ఫూర్తి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గత టీడీపీ పాలనలో ఏ ఒక్కరూ కూడా ప్రజల వద్దకు వచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రజల కనీస అవసరాలు తెలుసుకోకుండా కేవలం ప్రజలను ఓటు బ్యాంకుగా జేసీ సోదరులు వాడుకున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలు చెబుతూ వారి పబ్బం గడుపుకున్నారే తప్పా ఏ ఒక్కరోజూ కూడా ప్రజలను ప్రజల్లా చూడలేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించినప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉన్నానన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకే నిత్యం ఊరూరా పర్యటిస్తున్నానని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ జి.రవి, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, జబ్బార్, జావిద్‌ఖాద్రీ, బాబా వైఎస్సార్ విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


పెద్దపప్పూరు జెడ్పీ పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు


మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోత్స్న

గార్లదిన్నె: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం స్కూల్‌గేమ్స్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్-17 బాలుర, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించి విజేతలకు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరమణ నాయక్, హెచ్ఎం సుంకన్న, పీడీ శ్రీనివాసరెడ్డి, పీఈటీలు జస్సీ, లింగమ్య, వెంకటేషులు, నారాయణ, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొంటున్నారు. మంగళవారం వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో సీ.బండమీదపల్లి విద్యార్థులు విన్నర్‌గా నిలిచారు. బాలికల రెండు విభాగాల్లోను సీ.బండమీదపల్లి విద్యార్థులు గెలుపొందారు. కబడ్డీ అండర్-14 బాలికల విభాగంలో విన్నర్‌గా సలకంచెర్వు, రన్నర్‌గా ఎంజేపీ , ఈస్ట్ నరసాపురం, అండర్-17 విభాగంలో విన్నర్‌గా కేజీబీవీ, రన్నర్‌గా సీ.బండమీదపల్లి నిలిచాయి. బాలుర విభాగం కబడ్డీ అండర్-14, అండర్ -17 విభాగంలో విన్నర్స్‌గా సలకంచెరువు, రన్నర్‌గా తరిమెల మైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. పీడీ నందకుమార్, పీఈటీలు శివమ్మ, నరేంద్ర, జయపరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శిరీష, స్వర్ణ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: క్రీడల్లో పోటీతత్వం ఉంటే విజయాలు సాధించవచ్చని ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) మండల కోఆర్డినేటర్ శ్రీధర్ అన్నారు. మంగళవారం పెద్దపప్పూరులోని జెడ్పీ పాఠశాలలో ప్రతిభావంతులను ఎంపిక చేయడానికి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీలు సమీరా, నారాయణమ్మ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ పథకాల పంట


ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెంకటరెడ్డిపల్లిలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించిన ఘనత జగనన్నేదన్నారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా దళారులు లేకుండా, అవినీతి రహితపాలన అందిస్తుండడంతో ఇతర రాష్ట్రాలు ఏపీ వైపు చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్డీ జిలాన్ బాషా, ఎంపీటీసీ పవన్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, దస్తగిరిరెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లుటౌన్: ప్రైవేట్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పల్లవి స్కూల్‌లో అసోసియేషన్ సాధారణ సమావేశం జరిగింది. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే కరస్పాండెంట్స్ సమావేశంలో ప్రైవేట్ స్కూల్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి. పట్టణాధ్యక్షుడు పవన్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఆసీఫ్, విశ్వనాథ్, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి కిశోర్, నాగార్జున, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడి రాజీనామా

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మి నారాయణరెడ్డి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వయోభారం రీత్యా పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు 15 ఏళ్లుగా తనకు సహకరించిన సహచరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చేపల కాలనీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి లక్ష్మి స్వాతి పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంచి వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులలో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

15 న 'ప్రత్యేక స్పందన'

గుత్తి రూరల్: గుత్తి మునిసిపాలిటీ, మండలానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నిజామీ షాదీఖానాలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే స్పందన కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి, ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ సూచించారు.

నేడు' జగనన్నకు చెబుదాం'

పెద్దపప్పూరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి తో పాటు వివిద శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా అర్జీల రూపంలో తెలియజేయవచ్చని సూచించారు.

అనుమతి తప్పనిసరి

నార్పల: వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: పుట్లూరు మండలం కోమటికుంట్ల పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1,10,650 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం


సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

పెద్దపప్పూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తురకపల్లిలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల,మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) వైస్ ఎంపీపీ పప్పుక కళావతి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, రవిప్రసాద్ రెడ్డి, స్థానిక నేతలు శివారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం

గుంతకల్లుటౌన్: మహిళలకు కుట్టుశిక్షణ ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ఆ నలుగురు సేవా సమితి లక్ష్యమని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తెలిపారు. శ్రీవిద్యారణ్య బాసట కార్యక్రమంలో భాగంగా పాతగుంతకల్లు బొడ్డుచావిడి వీధిలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వెంకటేష్ మాట్లాడుతూ గృహిణీలు ఖాళీ సమయాల్లో దుస్తులను కుట్టుకోవడం ద్వారా కొంతైనా సంపాదించవచ్చన్న ఉద్దేశంతోనే ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే రోజుల్లో వారికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సమితి ఉపాధ్యక్షుడు రవీంద్ర, సభ్యులు శ్రీదేవి, కేశవ, కృష్ణమూర్తి, రాజశేఖర్, స్నేహ, అంజలి, అశోక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అడ్డుకుందాం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

శింగనమల: బాల్య వివాహాలను అందరం కలిసికట్టుగా ఆరికడదామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహా నిరోధక అధికారుల అధికారాలు-విధుల బాధ్యతలపై ఒక రోజు డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. వీటిపై ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వివరించారు. సీడీపీఓలు భారతి, షాజిదా, ఎంపీడీఓలు యోగనందారెడ్డి, వీరరాజ రంగారావు, రామకృష్ణ, తహసీల్దార్లు మోహన్‌కుమార్, సుమతి, మునివేలు, లక్ష్మీనాయక్, మండల వైద్యాధికారులు శ్రీదేవి, చంద్రశేఖర్, నాగరాజు, ఓబులపతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, లీగల్ ఆఫీసర్ సంధ్యారాణి, చంద్రకళ, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నాగసముద్రంలో గత వారం రోజులుగా సాగుతున్న కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈసందర్భంగా శ్రీకృష్ణుడి ప్రతిమను పుష్పాలంకరణతో పల్లకీపై కొలువుదీర్చి గ్రామవీధుల్లో ఊరేగించారు.

పామిడి: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద పామిడి ఇందూ జ్ఞాన వేదిక- ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని మంగళవారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. వరుసగా పీబీ రామాంజనేయులు, ఆర్ హారిక, పీ సాయినేహ విజేతలుగా నిలిచారు. వీరికి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి విశ్వ, ఉపాధ్యాయుడు గంగాధర్, విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ దేవిరెడ్డి బహుమతుల అందించారు. పోటీలకు ఉపాధ్యాయులు చితంబరరెడ్డి, చిదంబర నాయుడు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

వేర్వేరు ఘటనల్లో 13 మందికి గాయాలు

పామిడి: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో 13 మంది గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాలు.. స్థానిక నాగులకట్టవీధికి చెందిన ఉపేంద్ర, అనంతకు బైక్ నిలిపిన విషయంపై గొడవ మొదలైంది. మాటామాటా పెరగడంతో ఉపేంద్ర వర్గీయులు సింహాద్రి, కిరణ్, వెంకటేష్, అనంత వర్గీయులు అంజి, ఆంజనేయులు, ప్రసాద్ కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘటనలో ఇరువర్గీయులైన 8 మందికి రక్త గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా స్థానిక దుర్గమ్మ వీధిలో విశ్వనాథ్, నాగవర్ధన్ వర్గీయులు భౌతిక దాడులు చేసుకున్నారు. విశ్వనాథ్ కుమార్తె చిన్నారిని నాగవర్ధన్ ఉన్నఫళంగా గద్దిస్తుండడంపై అతని భార్య వరలక్ష్మి గమనించింది. ఈవిషయమై వరలక్ష్మి, నాగవర్ధన్‌ను దండించింది. దీంతో విశ్వనాథ్, వరలక్ష్మి దంపతులకు, నాగవర్ధన్ వర్గీయులు చౌడప్ప, నాగేంద్ర నడుమ ఘర్షణ జరిగింది. ఘటనలో విశ్వనాథ్, వరలక్ష్మితో పాటు నాగవర్ధన్, చౌడప్ప, నాగేంద్ర గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అనంతపురం సర్వజనాసుపత్రికి రెఫర్ చేశారు. పామిడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చవితికి సిద్ధమైన గణనాథులు

- విక్రయాలు ప్రారంభం
- రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకూ ధరలు


తుదిమెరుగులు దిద్దుకుంటున్న గణనాథుడు

తాడిపత్రి అర్బన్: చవితి వేడుకలకు గణనాథుడు సిద్ధమయ్యాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అందంగా వివిధ రూపాల్లో తయారు చేయబడిన గణేష్ ప్రతిమలు ఇప్పటికే పట్టణానికి చేరుకున్నాయి. వినాయకచవితికి ఇక వారం రోజులు మాత్రమే గడువు వుండడంతో నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సుమారు 2500 విగ్రహాలకుపైగా గణనాథుని ప్రతిమలు చేరుకోగా రెండు రోజులుగా అమ్మకాలు ప్రారంభమయ్యాయి. 3 నుంచి 20 అడుగుల సైజుల్లో తయారు చేసిన ఈ ప్రతిమలు రూ.3 వేల నుంచి రూ.30వేల వరకు ధరలు పలుకుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ఈ ఏడాది పెద్దపీట వేసి కెమికల్స్ శాతాన్ని విగ్రహాల తయారీలో పూర్తిగా తగ్గించామని, మట్టి, వాటర్ పెయింటింగ్స్‌తో అందంగా తీర్చిదిద్దామని పలువురు తయారీదారులు చెబుతున్నారు. విక్రయ కేంద్రాల్లో మండపాల నిర్వాహకులు ఆకర్షణీయమైన వినాయ విగ్రహాలను కొలుగోలు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది విగ్రహాల ధరలు పెరిగినా కొనుగోలు చేసేందుకు వెనుకాడడం లేదు. ఇప్పటికే మండపాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. పట్టణంతో పాటు ఆయా మండలాల పరిధిలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను ప్రతిష్టించేందుకు ఏర్పాట్లలో ఆయా మండపాల కమిటీలు నిమగ్నమయ్యాయి.

తుదిమెరుగులు దిద్దుకుంటున్న గణనాథులు

నంద్యాల రోడ్డులోని పాత పెన్నా వంతెన సమీపం , షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో రంగు రంగుల ముచ్చటైన వివిధ భంగిమలలో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధం చేశారు. మరి కొద్ది రోజుల్లో జరుగనున్న వినాయకచవితి వేడుకల కోసం తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. విగ్రహాలను వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు కొద్ది నెలలుగా ఇక్కడే నివాసం ఏర్పరుచుకొని విగ్రహాల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని విగ్రహాలను గుంతకల్లు, వైఎస్సార్ జిల్లాలోని ప్రొద్దుటూరు, కర్ణాటకలోని హోస్పేట్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.


అమ్మకానికి సిద్ధమైన వివిధ రకాల గణేష్ ప్రతిమలు

వాటర్ కెమికల్స్ వాడుతున్నాం



పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాలతో పాటు వాటర్ కెమికల్స్‌నే వాడుతున్నాం. ఒక లీటర్ వాటర్ కెమికల్స్ రూ.900 నుంచి రూ.1100 వరకు ధర పలుకుతోంది. అది కూడా ఆన్‌లైన్‌లో ముందస్తుగా ఆర్డర్ చేయాలి. విగ్రహాల తయారీకి కూలీలు ఎంతో అవసరం . ప్రస్తుతం కూలీల కొరత అధికంగా ఉంది.

– గురుమూర్తి, విగ్రహాల తయారీదారుడు

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి


మాట్లాడుతున్న జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: జీవితంలో మనిషికి ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కాదని జిల్లా మానసిక వైద్యాధికారి విశ్వనాథ్‌రెడ్డి తెలియజేశారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా మంగళవారం ప్రభుత్వాస్పత్రి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ కలహాలు, మానసిక సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, అవమానాలు, నిందలు కారణాలేవైనా క్షణికావేశంలో ఎంతో మంది బలవన్మరణాలకు పాల్పడుతూ తమ జీవితాలను అర్ధాంతరంగా ముగించడం సరికాదన్నారు. జీవితం చాలా విలువైనదని, సమస్య ఏదైనా బతికి సాధించాలన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించి సమస్యల నుంచి ఎలా బయటపడాలో వైద్యులు వివరించారు. వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, వి.ఉమామహేశ్వరి, హరిత, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమావేశం

యల్లనూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీపై ఉపాధి అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు మండలంలో 890 ఉపాధి పనులకుగాను రూ.13.53 కోట్లు ఖర్చు చేశారన్నారు. పనులపై ఈ నెల 15 నుంచి 22 వరకు డీఆర్‌పీ బృందాలు సామాజిక తనిఖీతోపాటు గ్రామసభలు నిర్వహిస్తాయన్నారు. ఈనెల 23 సామాజిక తనిఖీపై బహిరంగ సభ(ప్రజావేదిక) నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ షబీర్‌బాషా, ఈసీ ఓబులు, ఎస్ఆర్‌పీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లపై బీఎల్‌ఓలకు అవగాహన

గుత్తి రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌లపై మంగళవారం బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు 25 కాలనీలకు సంబంధించిన పోలింగ్ బూత్‌ల వివరాలను చెప్పారు. పట్టణంలోని నివాస గృహాలు ఏ సచివాలయ పరిధిలోకి వస్తాయనే విషయాన్ని చర్చించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, కమిషనర్ శ్రీనివాసులు, టీపీఎస్ సూపర్‌వైజర్ మహబూబ్‌జాన్, ఏఈ సూర్య, ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం


కీర్తన(ఫైల్)

పెద్దవడుగూరు: విరుపాపురంలో 9వ తరగతి విద్యార్థిని అదృశ్యమైంది. పోలీసుల తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిరంజీవి కుమార్తె కీర్తన(14) మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి 11 గంటలకు ఇంటి కొచ్చింది. కొద్దిసేపు తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లితిరిగి రాలేదు. తల్లిదండ్రులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.